www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 198 | హైదరాబాద్ | ఆదివారం | 09-11-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## మెదక్ జిల్లాలో దారుణం.. కన్నతల్లిని కొట్టి చంపిన తనయుడు

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వేల్పుగొండలో దారుణం చోటుచేసుకుంది. మద్యానికి డబ్బులు కావాలని గొడవపడి కన్నతల్లినే హతమార్చాడో వ్యక్తి. తల్లి సత్యమ్మ (56)ను సుదర్శన్ కర్రతో తలపై కొట్టి చంపేశాడు. అనంతరం గ్రామం నుంచి పరారయ్యాడు. మద్యానికి బానిసైన నిందితుడు.. కొంతకాలంగా కుటుంబ సభ్యుల్ని వేధిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అతడి వేధింపులు భరించలేక.. మూడేళ్ల క్రితం భార్య వెళ్లిపోయినట్లు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## ఆఫ్రికా పర్యటనకు డీకే అరుణ

- **ఆఫ్రికా పర్యటనకు వెళుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**
- **భారత అధికారిక ప్రతినిధి బృందంలో డీకే అరుణకు స్థానం**
- **అంతర్జాతీయ వేదికపై తెలంగాణ మహిళా నాయకత్వానికి గుర్తింపు**

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆఫ్రికాలో జరిపే అధికారిక పర్యటనలో మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ పాల్గొననున్నారు. భారత ప్రతినిధి బృందంలో సభ్యురాలిగా ఆమె ఈ పర్యటనకు ఎంపికయ్యారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణకు ప్రాతినిధ్యం వహించే ఈ కీలక పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా వాణిజ్యం, వ్యవసాయం, సాంకేతికత, సాంస్కృతిక మార్పిడి వంటి కీలక రంగాల్లో భారత్, ఆఫ్రికా దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడంపై ప్రధానంగా చర్చలు జరపనున్నారు. తెలంగాణ మహిళా నాయకత్వాన్ని ప్రపంచ వేదికపై నిలబెట్టేందుకు ఇదొక గొప్ప అవకాశంగా డీకే అరుణ భావిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, మహిళల పురోగతి, రైతుల సంక్షేమం కోసం ఆమె చేసిన సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ, "ప్రపంచ ప్రగతిలో తెలంగాణ పాత్రను మరింత బలంగా



నిలబెట్టడమే నా లక్ష్యం. ఈ పర్యటన ద్వారా మహిళలు, రైతులు, యువతకు ఉపయోగపడే అవకాశాలను మన రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తాను" అని తెలిపారు. ఈ పర్యటనతో భారత్‌ఆఫ్రికా సంబంధాలు కొత్త దిశగా పయనిస్తాయని, అదే సమయంలో తెలంగాణ ప్రతిష్ఠ అంతర్జాతీయంగా ఇనుమడిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## సీఎం రేవంత్ భాష వీధి రౌడీలా ఉంది

- **ఫీజు బకాయిలు చెల్లించకుండా బెదిరింపులా అని కవిత ఫైర్**
- **కాలేజీ యాజమాన్యాల తాట తీస్తామనడం దారుణమని విమర్శ**
- **మాట తప్పింది మీరు, బంద్‌కు కారణమూ మీరేనని ఆరోపణ**

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలను "తాట తీస్తా, తొక్కుతా" అంటూ సీఎం హెచ్చరించడాన్ని ఆమె తప్పుబట్టారు. సీఎం వాడిన భాష వీధి రౌడీలు కూడా సిగ్గుపడేలా ఉందని ఘాటుగా విమర్శించారు. 'జనం బాట' కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన కవిత, హన్మకొండలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతోనే కాలేజీ యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. మాట తప్పింది మీరు. అలాంటప్పుడు వారి తాట, తోలు తీస్తామని అనడం ఎంతవరకు సమంజసం? తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తు కోసం నిలబడిన వారిపై మీ వీరంగమా?" అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి, యాజమాన్యాలను బెదిరించే ధోరణి అవలంబిస్తోందని కవిత ఆరోపించారు. విద్యార్థుల కోసం పోరాడుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు తాము అండగా ఉంటామని, వారి తరపున పోరాడతామని ఆమె భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలి కానీ, బెదిరింపులతో కాదని హితవు పలికారు.

## రేవంత్ రెడ్డిలో భయం మొదలైంది

- **ముఖ్యమంత్రి మానసిక స్థితి దెబ్బతిన్నట్లు ఉందన్న జగదీశ్ రెడ్డి**
- **ముఖ్యమంత్రిని చూసి సిగ్గే సిగ్గుపడేలా ఉందని వ్యాఖ్య**
- **హైదరాబాద్ అభివృద్ధి అజెండా పైనే జూబ్లీహిల్స్ లో ఓటు వేయబోతున్నారని వ్యాఖ్య**

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల అనంతరం తన పదవికి గండం పొంచి ఉందనే భయం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో మొదలైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత జగదీశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి మానసిక స్థితి దెబ్బతిన్నట్లుందని అందుకే సందర్భం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రిని చూసి సిగ్గే సిగ్గుపడేలా ఉందని వ్యాఖ్యానించారు. నగరంలో నిఘా పెట్టేందుకు కేసీఆర్ కమాండ్ కంట్రోల్ నిర్మిస్తే, రేవంత్ రెడ్డి అదే కమాండ్ కంట్రోల్‌లో కూర్చొని తమపై నిఘా పెడుతున్నారని మండిపడ్డారు. ప్రగతిభవన్‌లో బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు, కమాండ్ కంట్రోల్, సచివాలయం అంశాలపై కమిషన్ వేయవచ్చు కదా అని ప్రశ్నించారు. ప్రగతి భవన్‌లో ఎన్ని గదులు ఉన్నాయో చూడటానికి రావాలని సూచించారు. హైదరాబాద్ అభివృద్ధి అజెండా పైనే జూబ్లీహిల్స్ ప్రజలు ఓటు వేయబోతున్నారని జగదీశ్ రెడ్డి అన్నారు. దేశంలో ఎవరూ తిట్టని విధంగా వైఎస్‌ను, సోనియా గాంధీని రేవంత్ రెడ్డే తిట్టారని ఆరోపించారు. ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలను ఎన్ని రోజులు భయపెడతారని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదని జోస్యం చెప్పారు. రేవంత్ రెడ్డి చేసే తప్పులను చరిత్ర క్షమించదని అన్నారు. రేవంత్ రెడ్డి తన నోటి దురుసుతనం కారణంగా బీహార్ నుంచి వెళ్లగొట్టే పరిస్థితి తెచ్చుకున్నారని అన్నారు. బీహార్ ఎన్నికల ప్రచారానికి రేవంత్ రెడ్డిని కాదని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని పిలిపించుకున్నారని గుర్తు చేశారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఇద్దరు పదవుల్లో ఉన్నారు కాబట్టే వారిని బ్యాడ్ బ్రదర్స్ అని కేటీఆర్ అన్నారని వ్యాఖ్యానించారు. వారిద్దరూ మోదీ శిష్యులేనని అన్నారు. తెలంగాణ అభివృద్ధి, హైదరాబాద్ అభివృద్ధి బాధ్యతను రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలని సూచించారు. మాగంటి గోపీనాథ్ తల్లితో ఎవరు మాట్లాడిస్తున్నారో తెలుసని అన్నారు. రేవంత్ రెడ్డి ఓటమి భయంతో చేసే పనుల్లో ఇదీ ఒకటని విమర్శించారు. రేవంత్ రెడ్డి డ్రగ్స్ మత్తులో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక డ్రగ్స్ సంబంధిత నేరాలు ఎక్కువయ్యాయని అన్నారు. పోలీసు కమిషనర్లే నేరాల రేటు పెరిగిందని చెప్పారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి భాషతో తెలంగాణ పరువు పోతోందని, ఇప్పటికైనా ఆయన తన తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

## బహిరంగ చర్చకు సిద్ధమా? రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్



**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

సీఎం రేవంత్ రెడ్డి నిన్న గంటన్నర సేపు ప్రెస్ మీట్ చూసినవారికి రేవంత్ రెడ్డి మానసిక స్థితిపై సందేహం కలుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ ఎన్ని అడ్డదారులు తొక్కినా ఫలించకపోవడంతో ఆ ఫ్రస్టేషన్‌లో గంటన్నరసేపు అడ్డమైన చెత్త వాగారని ఈ ప్రభుత్వం నడపడం మాకు చేతకావడం లేదని ముఖ్యమంత్రి మాటల్లో తేలిపోయిందన్నారు. రేవంత్ రెడ్డి తన అసమర్థతను చెప్పకనే చెప్పుకున్నారని రెండు సంవత్సరాల రేవంత్ రెడ్డి పాలనలో చేసిందేమీ లేక గత కాంగ్రెస్ పాలనలో చేసింది చూసి ఓటు వేయాలని అడిగారని ఎద్దేవా చేశారు. ఇవాల తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలన చూసి ఓటేయమని అడిగారు. ఆనాడు టీడీపీలో ఉండి వైఎస్ఆర్ పావురాల గుట్టలో పావురం అయ్యాడు అని ఎలా అన్నావని ప్రశ్నించారు. ఆరోజు కాంగ్రెస్ పార్టీపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తప్పు అని క్షమాపణ చెప్పి నాటి కాంగ్రెస్ పాలన చూసి ఓటేయాలని అడగాలి.

**నోరు తెరిస్తే అబద్ధాలు:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడుతున్నారని అప్పుల విషయంలో సీఎందో మాట భట్టి విక్రమార్క మరో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. ఏది పడితే అది మాట్లాడటానికి రేవంత్ రెడ్డి దారిన పోయే దానయ్య కాదని ఆయన ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అన్నారు. కేసీఆర్ పాలనలో మొత్తం చేసిన అప్పులు 2,80,000 కోట్లు అని పార్లమెంట్లో బీజేపీ ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చిందని రేవంత్ రెడ్డి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎందుకు తిరోగమనం పాలవుతోందని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వేధింపులు, భూదందాల వల్ల రాష్ట్ర ఆదాయం తగ్గిందన్నారు. వీటిపై రివ్యూ చేసుకోవాలన్నారు. రేవంత్ రెడ్డి తినే కంచంలో ఉంచే రకం అని హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కట్టిన కమాండ్ కంట్రోల్ రూమ్, సచివాలయంలో కూర్చునేది నువ్వే కదా రేవంత్ రెడ్డి.. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం నుంచి గోదావరి నీళ్లు మల్లన్న సాగర్ ద్వారా మూసీకి తెస్తానని చెప్పింది నువ్వే కదా? అని నిలదీశారు. హైదరాబాదుపై కేసీఆర్ ముద్రను చెరపడం నీ జేజమ్మతో కూడా కాదని జూబ్లీహిల్స్ ప్యాలెస్ కిటికీలో నుండి చూస్తే నీకు కనపడే తీగల వంతెన కట్టింది కేసీఆర్ కాదా? అన్నారు. నాలాల్లో పూడిక తీయకపోవడం వల్ల హైదరాబాదులో వరదలు వచ్చాయని వరదలకు కారణం రేవంత్ రెడ్డే అన్నారు.

ఉద్యోగాల నోటిఫికేషన్లపై ఊకదంపుడు ఉపన్యాసమే తప్ప ఏమి లేదని అసెంబ్లీలో విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ప్రకారం ఒక నోటిఫికేషన్ అయినా ఇచ్చావా రేవంత్ రెడ్డి? అని నిలదీశారు. రుణమాఫీ, రైతుబంధు మీద చర్చిద్దాం అంటే ఒక్కరోజు అసెంబ్లీ పెట్టి పారిపోయాడు ఈ ముఖ్యమంత్రి మీరని ఇప్పుడు పది రోజులు అసెంబ్లీ పెట్టు. ఆరు గ్యారెంటీలపై చర్చిద్దామన్నారు. వికృత చేష్టలు, విచిత్ర విన్యాసాలు తప్ప ఈ ముఖ్యమంత్రి ప్రజలకు పనికొచ్చే ఒక్క పని చేయడం లేదన్నారు. కామారెడ్డిలో వరద బాధితులకు ఒక రూపాయి అయినా విడుదల చేశారా? ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు అడిగినందుకు ప్రైవేట్ కాలేజీలపై దాడులు చేస్తారా? అని మండిపడ్డారు. ఫీజు బకాయిలపై బహిరంగ చర్చకు సిద్ధమా రేవంత్ రెడ్డి? అని సవాల్ విసిరారు. పోయిన నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద కాంట్రాక్టర్లకు విడుదల చేసిన బిల్లులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హర్యానా, మహారాష్ట్ర, బీహార్ ఎన్నికల ముందు పెద్ద కాంట్రాక్టర్ల బిల్లులను ఈ ప్రభుత్వం విడుదల చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్మెయిల్ చేసి భయపెడుతున్నారుని దొంగే దొంగ అన్నట్టుంది రేవంత్ రెడ్డి తీరు.

**వారిది ఫెవికాల్ బంధం:**

కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డిది ఫెవికాల్ బంధం అని ఆరోపించారు. ఓటుకు నోటు కేసులో ఈడీ కేసు ఉంటే ఎందుకు విచారణ జరగడం లేదని ప్రశ్నించారు. బీహార్ ఎన్నికలకు డబ్బులు పంపుతున్నారని ఢిల్లీలో భట్టి విక్రమార్క ఇంట్లో ఐటీ రైడ్స్ జరిగాయని గుర్గావ్‌లో భట్టి విక్రమార్క ఇల్లు, ఆయన అత్తగారిల్లు ఉంది. ఈ విషయం ఎందుకు బయటకు రాలేదు. బీజేపీకి కాంగ్రెస్ కి మధ్యలో ఉన్న ఒప్పందం ఏమిటి? అని ప్రశ్నించారు. పొంగులేటి ఇంట్లో ఈడీ రైడ్స్ ఐతే ఎందుకు చెప్పలేదు. ఈడీ ఎందుకు పొంగులేటిపై ప్రెస్ స్టేట్మెంట్ ఇవ్వలేదన్నారు. బీజేపీతో రేవంత్ రెడ్డికి చీకటి ఒప్పందాలు ఉన్నాయన్నారు.

## జూబ్లీహిల్స్‌లో పక్క నియోజకవర్గాల ఓటర్లను చేర్చారు

- **ఈసీని గుప్పెట్లో పెట్టుకుని బీజేపీ అవకతవకలకు పాల్పడుతోందని విమర్శ**
- **ఎన్నికల సంఘాన్ని బీజేపీ ప్రభావితం చేస్తోందన్న టీపీసీసీ చీఫ్**
- **మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో జనాభిప్రాయం ప్రకారం ఫలితాలు రాలేదన్న మీనాక్షి**

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పక్క నియోజకవర్గాల ఓటర్లను చేర్చారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఈసీని గుప్పెట్లో పెట్టుకుని బీజేపీ అవకతవకలకు పాల్పడుతోందని ఆయన విమర్శించారు. దీనిని రాహుల్ గాంధీ ఇదివరకే ఆధారాలతో సహా నిరూపించారని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సంఘాన్ని బీజేపీ ప్రభావితం చేస్తోందని ఆరోపించారు. హర్యానాలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని అందరూ భావించారని, కానీ అక్కడ బీజేపీ గెలుపొందిందని గుర్తు చేశారు. హర్యానాలో 25 లక్షల నకిలీ ఓట్లు ఉన్నాయని, ఒకే మహిళ ఫొటోతో వంద ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. ఇతర రాష్ట్రాలలోని వ్యక్తులను సైతం ఓటర్లుగా చేర్చినట్లు తెలిపారు. బీహార్‌లో తమకు బలం లేని చోట బీజేపీ ఓట్లను తొలగించిందని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఆధారాలతో సహా ఈసీని ప్రశ్నించారని, కానీ ఎలాంటి సమాధానం రాలేదని విమర్శించారు. ఓట్ల అవకతవకలకు వ్యతిరేకంగా సంతకాలు సేకరిస్తున్నామని, ఇప్పటి వరకు దేశంలో 5 కోట్ల సంతకాల సేకరణ జరిగిందని అన్నారు. మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో జనాభిప్రాయం ప్రకారం ఫలితాలు రాలేదని మీనాక్షి నటరాజన్ అన్నారు. స్వతంత్ర దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని అన్నారు. ఓట్ల చోరీపై ఇటీవల రాహుల్ గాంధీ మీడియాకు వివరాలు వెల్లడించారని, కొన్ని ప్రాంతాల్లో ఒకే చిరునామాతో ఎక్కువ ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. హర్యానాలో 8 సీట్లలో 400 ఓట్ల వ్యత్యాసంతో కాంగ్రెస్ ఓడిపోయిందని గుర్తు చేశారు.

## రేవంత్‌రెడ్డి మాటల్లో ఓటమి భయం కనిపిస్తోంది


**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

సీఎం రేవంత్‌రెడ్డి మాటల్లో కాంగ్రెస్ ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోందని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. ఫ్రస్టేషన్‌లో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. భాజపాపై నిందలు వేస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడారు. కాంగ్రెస్ వైఫల్యాల నుంచి తప్పించుకునేందుకు భాజపాపై నిందలు వేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటికొక ఉద్యోగం అంటూ.. మీ మిత్రుడు బిహార్‌లో హామీ ఇచ్చారు. 7 కోట్ల మంది ఉన్న బిహార్‌లో ఇంటికొక ఉద్యోగం సాధ్యమేనా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రజలకు మీరిచ్చే గిఫ్ట్ ఏంటో చెప్పాలన్నారు. గతంలో కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి చెట్టాపట్టాలు వేసుకొని అధికారాన్ని పంచుకున్నారని ఆరోపించారు. 20 శాతం ఓట్ల కోసం ఇంకా దిగజారి మాట్లాడితే 80 శాతం ఉన్న ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం అని హెచ్చరించారు.



## బెంజ్ కారు ఎక్కగానే.. గంజి తాగి బతికిన సంగతి మర్చిపోతున్నారు

- **బెంజ్ కారు ఎక్కగానే.. గంజి తాగి బతికిన సంగతి మర్చిపోతున్నారు**
- **సంగారెడ్డిలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న జగ్గారెడ్డి**
- **మిత్రులతో సరదాగా మాట్లాడిన జగ్గారెడ్డి**



**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

గంజి తాగి బతికిన వాళ్లు బెంజ్‌లో తిరిగినప్పటికీ గతాన్ని మరిచిపోవద్దని వ్యాఖ్య బెంజ్ కారులో తిరిగే స్థోమత ఉన్నప్పటికీ తాను గంజికే కనెక్ట్ అయిన వ్యక్తినని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఒకప్పుడు గంజి తాగిన వాళ్లు ఆ తర్వాత కారులో తిరుగుతూ తాము గతంలో గడిపిన జీవితాన్ని మరిచిపోతున్నారని ఆయన అన్నారు. శనివారం సంగారెడ్డిలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తన మిత్రులతో సరదాగా మాట్లాడుతూ, దేశం, రాష్ట్రంలో ఇది పెద్ద సమస్యగా మారిందని ఆయన అన్నారు. గంజి తాగి బతికిన వాళ్లు బెంజ్‌లో తిరిగినప్పటికీ గతాన్ని మరిచిపోకూడదని ఆయన అన్నారు.

# రాష్ట్ర భవిష్యత్ కోసమే పోలవరం విస్తరణ..
# మళ్లీ పాత పాట పాడిన ఏపీ సర్కారు

- వరద జలాలనే వాడుకుంటాం
- తెలంగాణ అభ్యంతరాలు బేఖాతర్
- ముంపును తేల్చేందుకు సంయుక్త కమిటీ
- పీపీఏ 17వ సమావేశంలో నిర్ణయం

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్:**

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ అవసరాల కోసమే పోలవరం ప్రాజెక్టును విస్తరిస్తున్నామని, వరద జలాలను వినియోగించుకుంటామని ఆ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ మేరకు పాత వాదనలనే మరోసారి పోలవరం ప్రాజెక్టు అథారిటీకి వినిపించింది. ట్రిబ్యునల్, టీఏసీ అనుమతులకు విరుద్ధంగా చేపడుతున్న పనులను సమర్థించుకుంది. హైదరాబాద్‌లోని కృష్ణాగోదావరి భవన్‌లోని కార్యాలయంలో శుక్రవారం పీపీఏ 17వ సమావేశం జరిగింది. పీపీఏ సీఈవో, సీడబ్ల్యూసీ చైర్మన్ అతుల్‌జైన్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి, ముంపు, రాష్ట్రాల అభ్యంతరాలు, కార్యాలయ తరలింపు వంటి అంశాలపై చర్చించారు. తెలంగాణ ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. టీఏసీకి విరుద్ధంగా ఏపీ పోలవరం ప్రాజెక్టు సామర్థ్యాలను ఇష్టారీతిన పెంచుకుంటూ పోతున్నదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఎగువ రాష్ట్రాలు కూడా ఇలాగే ప్రాజెక్టులను కడితే దిగువ రాష్ట్రాలకు చుక నీరు రాదని, ఈ అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు విస్తరణను, బనకచర్ల లింక్ పనులను చేపట్టకుండా ఏపీని నిలువరించాలని కోరారు. పోలవరం బ్యాక్‌వాటర్‌తో తెలంగాణలో తలెత్తే ముంపుపై జాయింట్ సర్వే చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా ఎలాంటి చర్యలూ చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలను ఏపీ మరోసారి వ్యతిరేకించింది. రాష్ట్ర భవిష్యత్ అవసరాల కోసమే పోలవరం ప్రాజెక్టును విస్తరిస్తున్నామని, అయినప్పటికీ వరద జలాలనే వాడుకుంటామని ఏపీ మరోసారి వాదించింది.



**సాంకేతిక అంశాలతో మాకు సంబంధం లేదు..**
అనంతరం పీపీఏ సీఈవో అతుల్ జైన్ మాట్లాడుతూ.. తెలంగాణ అభ్యంతరాలతో తమకేమీ సంబంధం లేదన్నట్టుగా బదులిచ్చారు. కేంద్ర గెజిట్ ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, మెయింటెనెన్స్ మాత్రమే తాము చూస్తామని, ఫేజ్ 1 పనులను డిసెంబర్ 2027 నాటికి పూర్తిచేస్తామని తెలిపారు. ప్రాజెక్టు సాంకేతిక అంశాలు తమ పరిధిలోకి రావని స్పష్టం చేశారు. ముంపును తేల్చేందుకు ఏపీ, తెలంగాణ, పీపీఏ అధికారులతో జాయింట్ కమిటీని ఏర్పాటు చేస్తామని, ఆ కమిటీ సమర్పించే నివేదికను పరిశీలించాక నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. సమావేశానికి తెలంగాణ ఈఎన్సీ జనరల్ అమ్జాద్ హుస్సేన్, ఇంటర్‌స్టేట్ వాటర్ రిసోర్సెస్ సీఈ ప్రసాద్, అధికారులు విజయ్ కుమార్, సుబ్రమణ్య ప్రసాద్‌తో పాటు ఏపీ ఈఎన్సీ, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ హాజరయ్యారు. కేంద్ర జల్‌శక్తి శాఖ, సీడబ్ల్యూసీ అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

## పదవులు లేకున్నా ప్రజా సేవే
# లక్ష్యంగా పని చేస్తున్నాడు

- కంటిశస్త్ర చికిత్సలు, వివాహా సహాయాలు, విద్యా సామాగ్రి అందచేత
- మండల ప్రజల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించిన బొంగు రాజేందర్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్:**

కొమురవెల్లి మండలంలో సేవా కార్యక్రమాలతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన వ్యక్తి బొంగు రాజేందర్ రెడ్డి..BRR ఫౌండేషన్‌ను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు, అందులో ముఖ్యంగా కంటి సమస్యతో బాధపడుతున్న మండల ప్రజలందరికీ కంటి పరీక్షల క్యాంపు పెట్టి అందులో అవసరం ఉన్న వారందరికీ తన సొంత ఖర్చులతో శస్త్ర చికిత్సలు చేయించాడు..ఈ సందర్భంగా కంటి చికిత్సలు చేయించుకున్న వారందరూ వాళ్ళ వారు పట్టించుకున్న ఈ రాజేందర్ రెడ్డి సొంత కుటుంబ సభ్యులుగా భావించి మాకు ఈ శస్త్ర చికిత్సలు చేయించాడు అని, ఆయనకు మేము జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు.. అదే విధంగా మండలంలోని పేదింటి ఆడ పిల్లల పెళ్లికి ఒక అన్నగా అండగా ఉండి వారికి పూస్తే మట్టెలు అందిస్తాడు..మండలంలో ఎవరూ చనిపోయిన వారి ఇంటికి వెళ్లి పరామర్శించి తన వంతుగా 5000 రూపాయలు సాయం అందించి వారి కుటుంబానికి కూడా అండగా నిలుస్తాడు..ఇవే కాకుండా కొమురవెల్లి మండల ప్రజలకు ఎన్నో రకాలుగా సేవలు అందించాడు, అందిస్తూనే ఉంటాడు ఈ రాజేందర్ రెడ్డి..ఇలాంటి సేవా చేసే నాయకుడు కొమురవెల్లి మండలానికి ఉండటం ఆ మండల ప్రజలు అందరూ ఎంతో అదృష్టంగా భావిస్తున్నారు..ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సేవ చేసే అదృష్టం అందరికీ దొరకదు అని అలాంటిది నాకు దొరికింది అని ఈ సేవ కార్యక్రమాలు నా ఊపిరి ఉన్నంత వరకు కొనసాగిస్తూనే ఉంటాను అని తెలిపారు..



## బోరబండ కాలేజీ వసతులపై
# టీఎస్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాలు

- అడ్వకేట్ రామారావు పిటీషన్కు స్పందించిన ఎస్హెచ్ఆర్సీ

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్:**



బోరబండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాథమిక వసతుల కొరతపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (టీఎస్హెచ్ఆర్సీ) కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మానేని దాఖలు చేసిన కేసు నంబర్ 7062/2025 ఆధారంగా కమిషన్ ఈ చర్యలు చేపట్టింది. ఇంటర్మీడియట్ విద్య కమిషనర్, కార్యదర్శి యోగితా రాణా తక్షణమే బోరబండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న దారుణ పరిస్థితులను సరిచేసి అవసరమైన సదుపాయాలు కల్పించాలని కమిషన్ ఆదేశించింది. కళాశాలలో టాయిలెట్లను మరమ్మతు చేసి శుభ్రతకు తగిన చర్యలు తీసుకోవాలని, పారిశుద్య కార్మికులను కేటాయించాలని, లెక్చరర్ల సంఖ్యను పెంచాలని, విద్యార్థులకు శుభ్రమైన తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించింది. రామారావు ఇమ్మానేని తన ఫిర్యాదులో కళాశాలలోని దయనీయ పరిస్థితులను కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఫ్లష్ ట్యాంకులు లేకుండా కంపుకొడుతున్న టాయిలెట్లు, నీటి కొరత, పారిశుద్య లోపం కారణంగా విద్యార్థులు పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల టాయిలెట్లను వాడాల్సి వస్తోందని వివరించారు. ఈ విషయాలను తీవ్రంగా పరిగణించిన మానవ హక్కుల కమిషన్ ప్రభుత్వాన్ని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.ప్రజల పిల్లల భవిష్యత్తు పట్ల నిర్లక్ష్యం చూపుతున్న ప్రభుత్వం ఎప్పుడు మేల్కొంటుందో అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

# బీఆర్ఎస్‌కు సొంత వ్యూహం లేదు..

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని కీలక వ్యాఖ్యలు

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్:**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలిస్తే బీజేపీకి ఉపయోగం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అసలు గెలవ వద్దనేది తమ లక్ష్యమని, బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జూబ్లీహిల్స్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌కు సొంత వ్యూహం లేదని, బీజేపీతో ఘర్షణ ఎందుకనే వైఖరితో బీజేపీకి అనుకూలంగా ముందుకు వెళుతుందని ఆరోపించారు. అందులో భాగంగానే గతంలో కేసులు ఉన్నాయని ఉద్దేశంతో పలు కీలక ఎన్నికల్లో బీజేపీకి అనుకూల వైఖరిని బీఆర్ఎస్ తీసుకుందన్నారు. ఇప్పుడు కూడా జూబ్లీహిల్స్ ఎన్నికలో బీఆర్ఎస్ అదే వైఖరిని అవలంబిస్తే సైద్ధాంతికంగా బీజేపీకి అవకాశం ఇచ్చినట్లు అవుతుందని, అందుకే బీజేపీని, దానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ఉంటే ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ విధానాలు నిలకడగా లేవని, అప్పటికప్పుడు అవసరాన్ని బట్టి మార్చుకుంటున్నారని, లౌకిక విధానం, సామ్రాజ్యవాదం, మతపరమైన తదితర అంశాల విషయంలో బీజేపీకి అనుకూలమైన వైఖరిని బీఆర్ఎస్ అవలంభిస్తున్నదని తెలిపారు. శత్రువుకు శత్రువు మిత్రుడు అనే సూత్రంతో బీజేపీకి అనుకూలంగా, కాంగ్రెస్ వ్యతిరేకంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తున్నదని ఆయన విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ దోస్తీ ఏమిటో తెలియదు కానీ అంతర్గతంగా రెండు పార్టీల మధ్య ఏదో స్నేహ ఉన్నట్లు కనబడుతున్నదని ఆరోపించారు.

**మావోయిస్టులకు విజ్ఞప్తి..**
కొంతమంది మావోయిస్టులు మంచి ఉద్దేశంతో లొంగిపోతున్నారని కూనంనేని అన్నారు. ఇప్పటికీ మావోయిస్టులపై ప్రజలకు అభిమానం ఉందని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ, అనంతరం పునర్ విమర్శ చేసుకుని సాయుధ పోరాటాన్ని విరమించిందని గుర్తుకు చేశారు. తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టులను అత్యంత భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించారన్నారు. మావోయిస్టులు కూడా మంచి ఆలోచన చేసి సాయుధ పోరాటాన్ని విరమించాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టుల త్యాగాలు వృధా కావొద్దని, అందరం కలుద్దాం.. అందరం కలిస్తే దేశానికి మంచి జరుగుతుందని అని కూనంనేని సాంబశివరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల గొంతు నులుముతోందని ఆరోపించారు. 2026 మార్చి నాటికి మావోయిస్టు లేకుండా చేస్తామని కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటించారని, కానీ కమ్యూనిజాన్ని రూపుమాపడం ఆయన తరం కాదని స్పష్టం చేశారు.




# గాంధీ సెంటర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ధర్నా

- కాంట్రాక్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్:**

చేర్యాల మండల కేంద్రంలోని గాంధీ సెంటర్ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని కాంట్రాక్టర్ వైఖరిని నిరసిస్తూ శనివారం స్థానిక వ్యాపారస్తులు, పట్టణ ప్రజలు బ్రిడ్జిపై ఆందోళన నిర్వహించారు. అరగంట పాటు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సంఘటనా స్థలానికి చేర్యాల ఏఎస్ఐ నవీన్ కుమార్ పోలీస్ సిబ్బందితో చేరుకొని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. గత రెండు సంవత్సరాలుగా గాంధీ సెంటర్ వద్ద సాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో కనీసం నీరు కొట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో కంకర రాళ్లు దుమ్ము దూళితో వ్యాపారస్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చరిత్ర కలిగిన గాంధీ సెంటర్ ను నిర్వీర్యం చేస్తూ బ్రిడ్జి పొడవును పెంచడంతో పోచమ్మ వీధి కడవెరుగు రోడ్డు వెళ్లే దారులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ చౌరస్తాను సుందరీకరణ చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంగా సాగుతున్న పనుల పట్ల ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.






# గాంధీ మెడికల్‌కాలేజీలో ఇంటెన్సివ్ ఆర్థోపెడిక్స్ పీజీ టీచింగ్ ప్రోగ్రాం

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్:**

గాంధీ మెడికల్‌కాలేజీ ఆర్థోపెడిక్స్‌విభాగం ఆధ్వర్యంలో ఐఓఏ ఆర్థోపెడిక్స్‌పోస్ట్‌గ్రాడ్యుయేట్ టీచింగ్‌ప్రోగ్రాం విజయవంతంగా నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ ఇంటెన్సివ్ అకాడెమిక్ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 200 మందికి పైగా పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు క్లినికల్‌నైపుణ్యాలను, డయగ్నస్టిక్‌అవగాహనను పెంపొందించేలా రూపొందించిన ఈ కార్యక్రమంలో పేషెంట్ ఎగ్జామినేషన్, క్లినికల్‌చర్చలు, కేస్‌బేస్డ్‌డిస్కషన్‌లు, హ్యాండ్స్‌ఆన్‌ట్రైనింగ్‌వంటి అంశాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఓఏ పీజీ కమిటీ చైర్మన్‌డాక్టర్‌సందీప్‌కుమార్, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌ఎన్. వాణి, గాంధీ మెడికల్‌కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె. ఇందిరా, కోర్స్‌చైర్మన్ లు డాక్టర్ బచ్చు శ్రీనివాస్, డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, అకాడెమిక్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.వి. రెడ్డి, ఆర్థోపెడిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రవి, సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్‌అంజనేయులు, డాక్టర్ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రాక్టికల్‌లెర్నింగ్, రియల్ టైమ్ క్లినికల్ ఫీడ్‌బ్యాక్ అందిస్తూ పేషెంట్ సెంటర్డ్ ఆర్థోపెడిక్ కేర్‌పట్ల అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ఇండియన్‌ఆర్థోపెడిక్‌అసోసియేషన్(ఐఓఏ), అన్ని ఫ్యాకల్టీ సభ్యులకు గాంధీ మెడికల్‌కాలేజీ ఆర్థోపెడిక్స్‌విభాగం ధన్యవాదాలు తెలిపింది.

## బెంజ్ కారులో తిరిగే స్థోమత ఉన్నా
# నేను గంజికే కనెక్ట్ అయ్యాను

- సంగారెడ్డిలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న జగ్గారెడ్డి
- మిత్రులతో సరదాగా మాట్లాడిన జగ్గారెడ్డి
- గంజి తాగి బతికిన వాళ్లు బెంజ్‌లో తిరిగినప్పటికీ గతాన్ని మరిచిపోవద్దని వ్యాఖ్య

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్:**



బెంజ్ కారులో తిరిగే స్థోమత ఉన్నప్పటికీ తాను గంజికే కనెక్ట్ అయిన వ్యక్తినని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఒకప్పుడు గంజి తాగిన వాళ్లు ఆ తర్వాత కారులో తిరుగుతూ తాము గతంలో గడిపిన జీవితాన్ని మరిచిపోతున్నారని ఆయన అన్నారు. శనివారం సంగారెడ్డిలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తన మిత్రులతో సరదాగా మాట్లాడుతూ, దేశం, రాష్ట్రంలో ఇది పెద్ద సమస్యగా మారిందని ఆయన అన్నారు. గంజి తాగి బతికిన వాళ్లు బెంజ్‌లో తిరిగినప్పటికీ గతాన్ని మరిచిపోకూడదని ఆయన అన్నారు.

## ఆర్య వైశ్య సంఘం తుకారాంగేట్
# కొత్త అధ్యక్షుడిగా మల్లవోలు శ్రీకాంత్

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్:**

ఆర్య వైశ్య సంఘం తుకారాంగేట్ నూతన పదవుల నియామకాలు పూర్తయ్యాయి. అధ్యక్షుడిగా మల్లవోలు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా నాగబండి శ్రీనివాస్, కోశాధికారిగా నూకల నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులుగా కర్ణకోట శ్రీనివాస్, కొడరపు అశోక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడు మల్లవోలు శ్రీకాంత్ మాట్లాడుతూ... సంఘం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని, సభ్యులందరినీ ఐక్యంగా కలిపి అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. అలాగే ఈ నెల 16న కార్తీకమాసం సందర్భంగా వనభోజనాల యాత్రను నిర్వహించనున్నట్లు ప్రకటించారు.



# 300 క్వింటాళ్ల పత్తి దగ్ధం.. బోరున విలపించిన రైతు కుటుంబం

- 300 క్వింటాళ్ల పత్తి దగ్ధం
- బోరున విలపించిన రైతు కుటుంబం
- బెజ్జంకి మండలంలో అగ్ని ప్రమాదం
- ఐలయ్య కుటుంబానికి పెద్ద నష్టం

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్:**

రైతులు ఎంతో కష్టపడి పండించిన పత్తి పంట నిల్వ ఉంచిన చోటే ప్రమాదవశాత్తు మంటలకు ఆహుతైన విషాద ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. సుమారు 300 క్వింటాళ్ల పత్తి పూర్తిగా కాలిపోవడంతో రైతు కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

**కౌలుకు తీసుకొని పత్తి సాగు..**

బెజ్జంకి గ్రామానికి చెందిన రైతు బండి ఐలయ్య, తన సొంత పది ఎకరాలతో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని ఈ ఏడాది పత్తి సాగు చేశారు. కొద్ది రోజులుగా పత్తి తీత పనులు కొనసాగుతుండగా, ఇంటికి తెచ్చిన పత్తిని తడి ఆరేందుకు వీలుగా ఖాళీ స్థలంలో టార్పాలిన్లు వేసి ఆరబెట్టారు.

**ప్రమాదవశాత్తు మంటలు..**

శనివారం మధ్యాహ్నం, ఆరబెట్టిన పత్తికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. క్షణాల్లోనే మంటలు తీవ్రరూపం దాల్చి, పత్తి మొత్తం కాలి బూడిదైంది. రైతు ఐలయ్యతో పాటు ఆయన కుమారులు రమేశ్, అనిల్, ఇతర కుటుంబ సభ్యులు మంటలు గమనించి ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ఘటనలో సుమారు 300 క్వింటాళ్ల మేర పత్తి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

**కళ్లముందే కష్టం బూడిద..**

పత్తి రైతు ఐలయ్య కుటుంబం తమ కష్టం కళ్ల ముందే బూడిద పాలు కావడంతో, తీవ్ర ఆవేదనకు గురై బోరున విలపించింది. అగ్నిప్రమాదం కారణంగా తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఘటనా స్థలాన్ని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ సౌజన్య పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.





## సిద్దిపేట ఆర్యవైశ్య సంఘు ఎన్నికల్లో తమ ప్యానెల్ ను గెలిపించాలి

- సిద్దిపేట ఆర్యవైశ్య సంఘు అధ్యక్ష అభ్యర్థి నేతి కైలాసం

సిద్దిపేట ఆర్యవైశ్య సంఘ సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా తాము పని చేస్తామని అధ్యక్ష అభ్యర్థి నేతి కైలాసం అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘ సభ్యుల అభివృద్ధి కోసం అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. సంఘ సభ్యులందరికీ అన్నివేళలా అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటామన్నారు. ఈనెల 9న ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు జరిగే ఎన్నికల్లో సంఘ సభ్యులు అందరూ తమ ప్యానెల్ కు ఓటు వేసి తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం సభ్యులు, అభ్యర్థులు కార్యదర్శి కొర్తివాడ శ్రీకాంత్, ఉపాధ్యక్షులు తొడుపునూరి వెంకటేశం, మురంశెట్టి సంతోష్, గందే నాగరాజు ,కార్యదర్శులు ఆంజనేయులు , సంకీర్త అభినయ్ పాల్గొన్నారు.



## ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

- బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుతూ సంబరాలు
- మరో పదిఏండ్ల పాటు కాంగ్రెస్ దే అధికారం
- రేవంత్ పాలనలో తెలంగాణ భేష్
- చిన్నకోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్

**సిద్దిపేట నియోజకవర్గం**

చిన్నకోడూరు మండల కేద్రం లో సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా చిన్నకోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ అధ్యర్యంలో అంబేద్కర్ చౌరసస్థా లో బాణాసంచా కాల్చి అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్బంగా మీసం మహేందర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఆయురారోగ్యాలతో మరెన్నో జరుపుకుంటూ పది కాలాల పాటు చల్లగా ఉండాలని, తెలంగాణ ప్రజలకు సుభిక్షమైన పాలన అందించాలని ఆకాంక్షించారు అంతేకాకుండా రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వంలో అమలయ్యే ఆరు గ్యారంటీలే వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టాం కడతారని, మరో పది ఏండ్లపాటు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని జోష్యం చెప్పారు ఈ కార్యక్రమంలో మండల ఉప అధ్యక్షులు సందబోయిన పర్శరాం, sc సెల్ మండల అధ్యక్షులు కొమ్ము ప్రశాంత్,ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, కిసాన్ సేల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాకాల భూపతిరెడ్డి,బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిక్కుడు అనిల్, ఫిషర్మెన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకట్, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు అంతగిరి చంద్రశేఖర్ చిన్నకోడూరు మండల్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎండి సలీం,ఎస్సీ సెల్ మాజీ మండల అధ్యక్షులు నముండ్ల వినోద్,చౌడారం గ్రామ శాఖ అధ్యక్షులు గొట్టిపర్తి చందు,కస్తూరిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు నక్కరాజు సీనియర్ నాయకులు పుచ్చకాయల వెంకట్ రెడ్డి,రామంచ గ్రామ శాఖ అధ్యక్షులు కొమ్మ ఎల్లయ్య,నర్సిలు చంద్లపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు కనకయ్య,అనుపాటి విజయ రెడ్డి, దూది ఎల్లారెడ్డి,దేవరాయ శేఖర్,చిన్నకోడూరు గ్రామ శాఖ అధ్యక్షులు గుడిమళ్ల మల్లేశం పాకాల లక్ష్మారెడ్డి, మేడిపల్లి అనిల్, మంద శ్రీకాంత్,భైరోజు రమేష్, తాళ్లపల్లి రాజు వెంకన్న.భాస్కర్ రాముని పట్ల గ్రామ శాఖ అధ్యక్షులు కర్రె మధు,ఓబులాపురం రాజు తదితరులు పాల్గొన్నారు



## తిరుమలగిరిలో సీసీటీవీ కెమెరాలను ప్రారంభించిన ఏసిపి

**సికింద్రాబాద్, నవంబర్ 08 ( సిద్దిపేట పవర్ ):**

తిరుమలగిరి చిన్నకమేల శ్రీ హనుమాన్ టెంపుల్ యూత్ అసోసియేషన్ సభ్యులు మహేష్, జోసెఫ్, శివ, అనిల్ తదితరులు ఆలయం మరియు పరిసర ప్రాంతాల్లో కొత్త సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తిరుమలగిరి ACP రమేష్ హాజరై కెమెరాలను ప్రారంభించారు. యువత చూపిన చొరవ ప్రశంసనీయమని అన్నారు. పీసీలు చారి, రామకృష్ణ, రవి తదితరులు యువతను ప్రోత్సహించారు.



## గజ్వేల్ లో న్యూ విజన్ ఐ క్లినిక్ అండ్ ఆప్టికల్ హాస్పిటల్ ప్రారంభం

- ముఖ్యతిథులుగా : ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి
- గజ్వేల్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**


గజ్వేల్ పట్టణంలో ని సంఘ పూర్ రోడ్ ఎక్స్ కేర్ హాస్పిటల్ పక్కన న్యూవిజన్ ఐ క్లినిక్ అండ్ అప్టికల్ హాస్పిటల్ డాక్టర్ యం యస్ జూలీ అప్తోపెట్రెస్ట్ బీ ఎఫ్ రూబెన్ ఆధ్వర్యంలో ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యతిధిగా ఉమ్మడి మెదక్ జిల్లా వంటేరు యాదవ రెడ్డి గజ్వేల్ ఏఎంసీ వైస్ మాజీ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతి యువకులు మంచిగా చదువుకొని తల్లి దండ్రులకు పేరు ప్రాక్యతలు తెచ్చేవిధంగా కృషి చేసి అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. యువత ఎలాంటి అవకాశాలు కృషి పట్టుదలతో కష్టపడి పై చదువులు చదివి ఎదగాలని అన్నారు. గజ్వేల్ పట్టణ ప్రజలు చేసుకున్న పుణ్యమని అత్యున్నత ఆధునిక అధునాతన టెక్నాలజీతో ఐ క్లినిక్ అప్టికల్ ప్రజలకు అందుబాటులో హాస్పిటల్ చేరువలో ఉన్నందున గజ్వేల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యాకుబ్ పాస్టర్ పాస్టర్లు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సీఎం రేవంత్ జన్మదిన వేడుకలు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి అష్టాయురాగ్యలతో నుండి నూరేళ్లు వర్ధిల్లాలని తెలంగాణ ప్రజలకు పరిపాలన మరింత చేరువ కావాలని మరో పదేండ్లు ముఖ్యమంత్రిగా అధిరోహించాలని తెలిపారు.అదేవిధంగా పదేండ్ల బీ ఆర్ యస్ పాలన లో జూబ్లీహిల్స్ అభివృద్ధి కుంటుపడిందని జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయంమని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు బత్తిని క్రాంతి కుమార్,యూత్ యువజన కాంగ్రెస్ బి సి సెల్ మండల అధ్యక్షులు లోకేష్ ,కొండ పోచమ్మ డైరెక్టర్ రాం రెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు వెంకటేష్ సీనియర్ నాయకులు గాల్ రెడ్డి దయాకర్ రెడ్డి సయ్యద్ మునీర్ మల్లికార్జున రెడ్డి, హనుమంత రెడ్డి,అమర రాము కేశిరెడ్డి కృష్ణ రెడ్డి మిట్టపల్లి వెంకటేష్ దండే వెంకటేష్ శ్రావణ్, ఆరీఫ్, బిలాల్ పలుగు గడ్డ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ మచ్చ బిక్షపతి దశరథ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## నల్లగుట్ట నాలా స్ట్రెచ్‌లో హైడ్రా స్పెషల్ డ్రైవ్

- స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌లలో సిల్ట్ తొలగింపు
- పనులు పరిశీలించిన కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్

**సికింద్రాబాద్, నవంబర్ 08 ( సిద్దిపేట పవర్ ) :**

గత వారం రోజులుగా నల్లగుట్ట నాలా స్ట్రెచ్ ప్రాంతంలో హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. ఈ సందర్భంగా స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌లలో పేరుకున్న సిల్ట్, చెత్తను తొలగించే పనులను సిబ్బంది చేస్తున్నారు. రామ్గోపాలపేట డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ శనివారం ఈ పనులను పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ..వర్షాకాలంలో నీటి నిల్వలు లేకుండా డ్రెయిన్‌లను క్రమం తప్పకుండా శుభ్రపరచడం అత్యవసరమని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మునిసిపల్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.సీనియర్ నాయకులు మదన్ పూలి, శ్రీనివాస్ యాదవ్, గోపీకిషన్, కోమల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆదేశాల మేరకు సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ బొమ్మల ప్రవీణ్ కుమార్ మరియు యూత్ కాంగ్రెస్ శ్రేణులు**



# పచ్చి అరటిపండు తీసుకోవడం కలిగే ప్రయోజనాలు మీకు తెలుసా ?

పచ్చి అరటిపండ్లు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న పోషకాహార పండ్లు. అవి పొటాషియం, ఫైబర్, విటమిన్ సి మరియు విటమిన్ బి6 వంటి ముఖ్యమైన పోషకాలకు మంచి మూలం. అయితే కాకుండా ఈ అరటి పండు తినడం వల్ల కడుపులో పుండ్లు, విరేచనాలు, దగ్గు ఇతర సమస్యలు త్వరగా నయమవుతాయి. పచ్చి అరటిపండు తినడం వల్ల కలిగే మరి కొన్ని లాభాలు ఏంటో మనం తెలుసుకుందాం.



రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది:పచ్చి అరటిపండ్లు తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటాయి అంటే అవి రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచవు. ఇది మధుమేహం ఉన్నవారికి మంచి ఎంపికగా చేస్తుంది.

గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది:పచ్చి అరటిపండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడానికి మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది.

శక్తి స్థాయిలను పెంచుతుంది:పచ్చి అరటిపండ్లు కార్బోహైడ్రేట్లకు మంచి మూలం, ఇవి శక్తి స్థాయిలను పెంచడంలో సహాయపడతాయి.

చర్మానికి మేలు:పచ్చి అరటిపండ్లలో ఉండే విటమిన్ సి చర్మానికి మేలు చేస్తుంది. ఇది ముడతలు, మొటిమలను నివారించి, చర్మాన్ని యవ్వనంగా ఉంచుతుంది.

**పచ్చి అరటిపండ్లను ఎలా తినాలి:**
పచ్చి అరటిపండ్లను అనేక విధాలుగా తినవచ్చు. వాటిని ఉడికించి, వేయించి, పులుసులో వేసి, చిప్స్ గా కూడా తినవచ్చు. పచ్చి అరటిపండ్లతో చేసిన పిండిని కూడా అనేక వంటకాలలో ఉపయోగించవచ్చు.

**పచ్చి అరటిపండ్లను తినేటప్పుడు గుర్తుంచుకోవలసిన విషయాలు**
పచ్చి అరటిపండ్లను ఎక్కువగా తినడం వల్ల కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. మధుమేహం ఉన్నవారు పచ్చి అరటిపండ్లను తినేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే పచ్చి అరటిపండ్లలో రక్తంలో చక్కెర స్థాయిలను పెంచే గుణం ఉంది. పచ్చి అరటిపండ్లు ఒక ఆరోగ్యకరమైన ఆహారం. వీటిని మీ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



# తిన్న తర్వాత ఐస్‌క్రీం తింటున్నారా?

ఐస్ క్రీంలు, డెజర్ట్‌లు ద్రవ గ్లూకోజ్‌తో నిండి ఉంటాయి. మనలో చాలా మంది తిన్న తర్వాత ఐస్‌క్రీం, గులాబ్ జామూన్ వంటి స్వీట్లను తింటారు. అది కూడా వేసవి కాలంలో మనం ఎక్కువగా కుల్ఫీ, ఐస్‌క్రీం వంటి గడ్డకట్టిన ఆహారాన్ని తినడానికి ఇష్టపడతాం. అయితే ఇవి మన శరీరానికి హానికరం అని మనం గుర్తించలేము. చాలా మంది పోషకాహార నిపుణులు కూడా ఇలాంటి ఘనీభవించిన ఆహారాన్ని తీసుకోవడం చాలా ప్రమాదకరమని చెబుతున్నారు. చెడు కొలెస్ట్రాల్ మీ ధమనులను మూసుకుపోయేలా చేస్తుంది. అదే విధంగా, ఘనీభవించిన డెజర్ట్‌లలో పాలు ఉండవు. అవి తరచుగా పాల ఘనపదార్థాలతో తయారు చేయబడతాయి. పాల ఘనపదార్థాలు, లేదా పాలపొడిలో ఆక్సిడైజ్డ్ కొలెస్ట్రాల్ ఉండవచ్చు, అది మన రక్తనాళాలకు హాని కలిగిస్తుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది

ఇవి మనకు అనారోగ్యకరం, సాధారణ వినియోగానికి పనికిరావు. అలాగే, స్తంభింప చేసిన ఆహారాలు 10.2% వెజిటబుల్ ఆయిల్ , వెజిటబుల్ ప్రోటీన్ పదార్థాలను కలిగి ఉన్నట్లు ప్యాకేజింగ్‌పై లేబుల్ చేయబడ్డాయి. ఘనీభవించిన డెజర్ట్‌లు ద్రవ గ్లూకోజ్‌తో నిండి ఉంటాయి. ఇది చక్కెర యొక్క కృత్రిమ మూలం. వీటిలో తరచుగా ఇలాంటి ఘనీభవించిన డెజర్ట్‌లకు కృత్రిమ రుచులు రంగులను జోడిస్తారు. కాబట్టి, ఇలాంటి ఫ్రోజెన్ డెజర్ట్‌లు మన శరీరానికి పూర్తిగా హానికరం. కాబట్టి, భోజనం చేసిన తర్వాత ఐస్‌క్రీం వంటి స్తంభింప చేసిన డెజర్ట్‌లను తినాలని మీకు అనిపిస్తే, మీరు పైన పేర్కొన్న అంశాలను దృష్టిలో ఉంచుకుని, స్తంభింపచేసిన డెజర్ట్‌లకు పూర్తిగా దూరంగా ఉంటే మంచిది.



# లంబసింగి అందాలు...

దట్టమైన పొగమంచు, తొలకరి చినుకుల్లా పడే మంచు తుంపరులు.. పచ్చని తివాచీ పరిచినట్లు ఉండే సుందరమైన లోయలు, అంతా ప్రకృతి సోయగాల మయం. వెరసి అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణం. ఇవన్నీ చూడాలంటే కాశ్మీర్‌కు లేక, విదేశాలకో వెళ్లనుకుంటున్నారా? అవసరం లేదు. మన ఆంధ్రప్రదేశ్‌లోనే అలాంటి ప్రదేశం ఒకటుంది. దానినే ముద్దుగా ఆంధ్రా ఊటీ అని పిలుస్తుంటారు. కాశ్మీర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా పిలవబడే లంబసింగి అందాలకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. ఆ విషయాలెంటో తెలుసుకుందాం పదండి..

**ప్రకృతి ప్రేమికులు ఒక్కసారైనా తప్పక చూడాల్సిన ప్రదేశం ఇది.. మేఘాలను పట్టుకోవచ్చు అనే ఫీలింగ్ కలిగే ప్రంతం అది.. ఆ హిల్స్ పై నిలబడితే మేఘాల్లో తేలిపోయే ఫీలింగ్ కలుగుతుంది. కేవలం సినిమాల్లో మాత్రమే కనిపించే సీనరలు మన కళ్లముందే ఆవిష్కరించే ప్రాంతం అది.. అందుకే ఇప్పుడు అందరి చూపు ఈ సరికొత్త పర్యాటక ప్రాంతంపై పడింది. అదే లంబసింగి.. అందే లంబసింగి మాత్రమే కాదు.. చుట్టుపక్కల ఇంకా చాలా అందమైన ప్రదేశాలు ఉన్నాయి. అవేంటో చూద్దాం**



ఏజెన్సీ ప్రాంతం అనగానే అందరికీ అరకు గుర్తుకు వస్తుంది. అయితే ఇక్కడ పర్యాటకులు సందర్శించేందుకు అనువైన ప్రదేశాలు చాలానే ఉన్నాయి. లంబసింగి, చింతపల్లి, కొత్తపల్లి ప్రాంతాల్లో కూడా ఎన్నో సుందరమైన ప్రదేశాలు ఉన్నాయి. లంబసింగి ఘాట్‌రోడ్‌లో కాఫీ తోటలు ఎంతగానో ప్రసిద్ధి చెందాయి. లంబసింగి చేరుకునే ముందు ఒక ఆలయం కనిపిస్తుంది. దానినే బోడకొండమ్మ దేవాలయం అంటారు. దీనికి అరకిలోమీటరు దిగువున ఒక జలపాతం ఉంటుంది. ఈ జలపాతంలోకి సుమారు 50 అడుగుల ఎత్తు నుంచి నీరు పడుతుంటుది. ఇక్కడికి కొద్ది దూరంలోనే లంబసింగి గ్రామం ఉంది. అయితే, ప్రతిఏటా ఇక్కడికి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. అందుకే ఆంధ్ర కశ్మీర్‌గా పిలువబడే లంబసింగికి ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. లంబసింగిని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0లో ఎంపిక చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా లంబసింగికి ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా గుర్తింపు కూడా లభించింది.

**ప్రత్యేక బస్సులు..**
విశాఖపట్నం నుంచి లంబసింగి ప్రాంతానికి వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు కూడా నడుపోతుంది ప్రభుత్వం. లంబసింగితో పాటు, కొత్తపల్లి వాటర్ ఫాల్స్, పాడేరు పరిసర ప్రాంతాలను ఒకే రోజులో చూసేలా ప్రత్యేక ప్యాకేజీలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.

**ఎలా చేరుకోవాలి ?**
లంబసింగికి సమీపంలో విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ 106 కిలోమీటర్ల దూరంలో ఉంది. విశాఖపట్నం రైల్వే స్టేషన్ 114 కిలోమీటర్ల దూరంలో ఉంది. నర్సీపట్నం రైల్వే స్టేషన్ కూడా ఉంది. ప్రభుత్వ బస్సులలో వచ్చేవారు నర్సీపట్నం, వైజాగ్, చింతపల్లి నుంచి 19 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. తదితర ప్రాంతాల నుంచి బస్సులలో రావొచ్చు.